క్లుప్తంగా

బొర్రమాంబ పుట్టబంగారు మహోత్సవం నేడు


బొర్రమాంబ తల్లి

అగనంపూడి: అగనంపూడి పరిసర ఎనిమిది గ్రామాల ప్రజల ఆరాధ్యదైవం బొర్రమాంబ అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా గురువారం పుట్ట బంగారు మహోత్సవం జరిపించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. గ్రామంలోని అమ్మవారి దగ్గరి నుంచి వనం వరకు భారీ ఊరేగింపుతో ఈ ఉత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ తెలిపారు.

చలివేంద్రంలో పానకం పంపిణీ


చలివేంద్రం వద్ద పానకం పంపిణీ చేస్తున్న సంఘం ప్రతినిధులు

అగనంపూడి: 79వ వార్డు పాత అగనంపూడి సత్రం కూడలిలో మహాత్మాగాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద పానకం పంపిణీ చేశారు. శ్రీరామ నవమి సందర్భంగా ముందుగా సీతారాములకు పూజలు చేశారు. కార్యక్రమంలో మహాత్మాగాంధీ సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు, ప్రతినిధులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తులు నేడు


గాజువాక : దివ్యాంగులు, 85 ఏళ్ల దాటిన వృద్ధులు తమ ఇంటినుంచే ఓటు వేసేందుకు అవకాశాన్ని కల్పిస్తూ ఎన్నికల కమిషన్ సిబ్బంది గురువారం దరఖాస్తులను పంపిణీ చేయనున్నారు. గాజువాక నియోజకవర్గంలోని 302 పోలింగ్ బూత్‌ల పరిధిలోను దివ్యాంగులు, 85 ఏళ్ల దాటిన వృద్ధులు 3,910 మంది ఉన్నట్లు ఎన్నికల సిబ్బంది గుర్తించారు. వారి ఇళ్లకు వెళ్లి సిబ్బంది దరఖాస్తులను అందజేయనున్నారు. వాటిని దరఖాస్తుదారులు వెంటనే పూరించి, సంబంధిత బీఎల్‌వోలకు అందజేయాలని రిటర్నింగ్ అధికారి డి.లక్ష్మారెడ్డి తెలియజేశారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన


గ్యాస్ ప్రమాదాలపై గంగిరెడ్ల కాలనీ వాసులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సబ్బవరం: అగ్నిప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని సబ్బవరం అగ్నిమాపక అధికారి జీవీ సత్యరాజు సూచించారు. మండలంలోని బుడగజంగాల కాలనీ, రెల్లి కాలనీల్లో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వంట చేస్తున్నప్పుడు గ్యాస్ లీకై అగ్నిప్రమాదాలు జరిగితే ఏవిధంగా నివారించాలి, విద్యుత్ ఉపకరణాలు వినియోగిస్తున్నప్పుడు అగ్నిప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వం.. నిత్యకల్యాణం


అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం బుధవారం నేత్రపర్వంగా జరిగింది. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

చూసిన కనులదే భాగ్యం

- వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవం
- వాడవాడలా పరిణయ సంబరం


అక్కిరెడ్డిపాలెంలో కల్యాణ మహోత్సవంలో మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

అక్కిరెడ్డిపాలెం: రఘుకుల తిలకుడు శ్రీరామచంద్రుడు.. జనక పుత్రి జానకిల పరిణయ వేడుక కనులపండువగా సాగింది. సీతారాముల కల్యాణ మహోత్సవానికి వాడవాడలా వేదికలు వెలిశాయి. శ్రీరామ నవమి సందర్భంగా రామాలయాలు భక్తులతో కళకళలాడాయి.

- మింది రామాలయంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర మంత్రి, వైఎస్సార్ సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ భార్య హిమగౌరి, తల్లి నాగమణితో కలిసి పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు వారికి ఆశీర్వచనాలు అందించారు.
- 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ పాల్గొన్నారు.
- షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో జరిగిన కల్యాణ వేడుకల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.
- తుంగ్లాం, నాతయ్యపాలెం, హరిజన జగ్గయ్యపాలెం, రాంనగర్, గుడివాడ అప్పన్న కాలనీల్లోని రామాలయాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి.

జాబిలీ హిల్స్‌లో..

అగనంపూడి: 79వ వార్డు అగనంపూడిలోని జాబిలీ హిల్స్ గేటెడ్ కమ్యూనిటీలో జానకిరాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

- 85వ వార్డు అగనంపూడిలోని షిర్డీసాయి బాబా మందిరంలో శ్రీరామ నవమి ఉత్సవాలు జరిపించారు. సీతారాముల పెళ్లి, తరువాత విందు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.


ఎస్టీబీఎల్ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

86,87 వార్డులో..

కూర్మన్నపాలెం: 86వ వార్డు రాజీవ్‌నగర్‌లోని రామాలయంలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి, విశాఖ జిల్లా పార్లమెంట్ ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అన్నసమారాధనను ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

- 87వ వార్డు వడ్లపూడి రామాలయంలో రాములోరి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కమనీయం..కల్యాణం

పెదగంట్యాడ: 65వ వార్డు ప్రియదర్శిని కాలనీలోని రామాలయంలో సీతా కల్యాణం జరిపించారు. సీతారాములను మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ అదనపు పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు, నాయకులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

- 74వ వార్డు దయాల్‌నగర్ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల ఉత్సవ మూర్తులకు కల్యాణం జరిపించారు. వియ్యపువాని పాలెంలోని రామాలయంలో పూజలు చేశారు. బీసీ రోడ్డులోని భక్తాంజనేయస్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు కన్నేపల్లి సీతాపతి శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి సీతారాములకు నూతన వస్త్రాలు సమర్పించారు.


మింది రామాలయంలో కుటుంబ సభ్యులతో పూజల్లో పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్

- 75వ వార్డు నెల్లిముక్కు రామాలయంలో కల్యాణం కమనీయంగా సాగింది. దూడ సింహాచలం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, నాయకులు గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి సుమన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో..

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సెక్టార్–1లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం విష్ణు సహస్ర నామపారాయణ, వేద పఠనం, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

- స్థానిక హనుమాన్ దేవాలయంలో జరిపించిన సీతా కల్యాణంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. ఏకాహం నిర్వహించారు.
- సత్యసాయి మందిరంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. స్వామికి వేకువజామున సుప్రభాతం, నగర సంకీర్తన, హనుమాన్ చాలీసా పారాయణ జరిగింది. విగ్రహాలకు అభిషేకాలు చేసి, ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ (ఫైనాన్స్) గణేష్, సమితి కన్వీనర్ జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో..

గాజువాక : 70వ వార్డు డ్రైవర్స్ కాలనీలోని సీతా సమేత కోదండరామచంద్ర స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేవతామూర్తులను పల్లకిలో ఊరేగించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

- 71వ వార్డు కుంచుమాంబ కాలనీలో శ్రీరామ నవమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు పానకం, ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ ఏర్పాట్లు పర్యవేక్షించింది.


షీలానగర్ ఎస్టీబీఎల్‌లో చూడముచ్చటగా సీతారాములు


రాజీవ్‌నగర్‌లో అన్నసమారాధనను ప్రారంభిస్తున్న దామా సుబ్బారావు


ఉక్కు వేంకటేశ్వరస్వామి దేవాలయంలో..


వడ్లపూడి రామాలయంలో కల్యాణ మహోత్సవం జరిపిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


65వ వార్డు ప్రియదర్శినీ కాలనీలో కల్యాణ వేడుకల్లో పాల్గొన్న అమర్‌నాథ్


70వ వార్డు డ్రైవర్స్ కాలనీలో కోదండరాముడి కల్యాణోత్సవం


కుంచుమాంబ కాలనీలో శ్రీరామనవమి ఉత్సవం


స్టీల్‌ప్లాంట్ సత్యసాయి మందిరంలో ..


75వ వార్డు నెల్లిముక్కు రామాలయంలో కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి


సీతారాములకు వస్త్రాలు సమర్పిస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి


అగనంపూడి జాబిలీ హిల్స్‌లో సీతారాముల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు


సీతారాముల ప్రతిమలను తీసుకువస్తున్న భక్తులు


షిర్డీ సాయి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

కార్మికుల పోరాటం స్ఫూర్తిదాయకం


దీక్ష శిబిరం వద్ద ఐక్యంగా నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న పోరాటం స్ఫూర్తిదాయకమని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఇంతటి సుదీర్ఘ పోరాటం చేస్తున్న ఘనత 'ఉక్కు' కార్మికులకే చెందుతుందన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ అర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1161వ రోజు, బుధవారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. విశాఖ ఉక్కు దీక్షను స్ఫూర్తిగా తీసుకుని దేశవ్యాప్తంగా కార్మికవర్గం ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ప్లాంట్‌లో ఉన్న విభాగాలను పునఃప్రారంభించి ఉత్పత్తిని పెంచాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే ప్రజా సంక్షేమం

పెదగంట్యాడ: వైఎస్సార్‌సీపీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ నాయకుడు గొందేశి ప్రభాకర్ రెడ్డి అన్నారు. గత ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. 75వ వార్డు పెదకోరాడలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గాజువాక నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న గుడివాడ అమర్‌నాథ్‌ను, విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స ఝూన్సీలకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో కుప్పిలి వరప్రసాద్‌రెడ్డి, శీరపు శ్రీనివాసరావు, కోరాడ కనకారావు, శీరపు శంకర్, గొందేశి రామకృష్ణారెడ్డి, కోరాడ రమణ, బస అప్పలరెడ్డి, కుప్పిలి రామిరెడ్డి, శీరపు రమణ పాల్గొన్నారు.


పెదకోరాడలో ప్రచారం చేస్తున్న నాయకులు

రామాయణం మానవేతిహాసం

సీతంపేట: రామాయణం మానవీయ విలువలకు పట్టం కట్టిన మహాకావ్యమని రచయిత డాక్టర్ డి.వి. సూర్యారావు పేర్కొన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో జరిగిన సాహిత్య కార్యక్రమంలో 'రామాయణం–సమాజం' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఆదికవి వాల్మీకి కరుణార్ద్ర హృదయం నుంచి శోకం శ్లోకంగా వెలువడి తరతరాలకు ఆరాధనీయమైన రామాయణ గ్రంథంగా ఉద్భవించిందన్నారు. రామాయణ కావ్యం కుటుంబ గాథ అని, అయోధ్యలో, కిష్కింధలో సోదర సంబంధాలు ఎలా ఉన్నాయో చిత్రించారన్నారు. ఆ కావ్యం ప్రదర్శించిన దాంపత్య జీవితం ఏ సమాజానికైనా ఆదర్శమని చెప్పారు. సత్యనిష్ఠ, ధర్మ దృష్టి, మహిళపై గౌరవం, పాలకుడి రుజువర్తనం, క్షమా గుణం, సంయమనం విలువలను రామాయణం ప్రబోధించిందని తెలిపారు. మితిమీరిన కామ ప్రవృత్తి ఎలా వినాసనకరమో రామాయణం చెబుతుందన్నారు. శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ రామాయణం వేద స్వరూపమని, రాముడి గుణగణాలు ఆదర్శంగా ఆచరించదగినవని పేర్కొన్నారు. కార్యక్రమంలో కె.జి.వేణు, ఎస్.విజయ్‌కుమార్, కె.వి.ఎస్.మూర్తి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రచయిత సూర్యారావు

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచి ప్రక్రియ ప్రారంభం
- 25వ తేదీ వరకు స్వీకరణ
- గాజువాక రిటర్నింగ్ అధికారి లక్ష్మారెడ్డి

సాక్షి ఇంటర్వ్యూ



గాజువాక : వచ్చేనెల 13న జరగనున్న సాధారణ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. పబ్లిక్ హాలిడే కావడంతో ఆదివారం నామినేషన్లను స్వీకరించబోమని గాజువాక రిటర్నింగ్ అధికారి డి.లక్ష్మారెడ్డి తెలిపారు. గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అభ్యర్థులు గాజువాక తహసీల్దార్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారికి తమ నామినేషన్లను సమర్పించాల్సి ఉంటుందన్నారు. దీనిపై రిటర్నింగ్ అధికారి పలు అంశాలను తెలియజేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

నేడు 11 గంటలకు ఫారం–1 పబ్లిక్ నోటీసు జారీ

ఎన్నికల నియమావళి అమలు కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నాం. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఫారం–1 పబ్లిక్ నోటీసును గురువారం ఉదయం 11 గంటలకు జారీ చేస్తాం. ఎమ్మెల్యే అభ్యర్థులందరూ గాజువాక తహసీల్దార్ కార్యాలయంలో గల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ పత్రాలను సమర్పించాలి. అభ్యర్థులు నామినేషన్‌తో పాటు అఫిడవిట్‌ను సమగ్రంగా సమర్పించాలి. నామినేషన్ పత్రంలో ప్రతీ గడి నింపి ఇవ్వాలి. ఖాళీ ఉంటే నోటీసు జారీ చేసి సవరించుకోవడానికి అవకాశం ఇస్తాం. రాజకీయ పార్టీల తరఫున పోటీ చేసే అభ్యర్థులు స్క్రూటినీ జరిగేలోపు ఒరిజినల్ ఫారం–బీతో పాటు ఫారం–ఏ కూడా సమర్పించాలి.

నామినేషన్లకు నిబంధనలివీ..

గుర్తింపు గల రాజకీయ పార్టీల నుంచి పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్‌ను ఒక్క వ్యక్తి ప్రతిపాదిస్తే సరిపోతుంది. గుర్తింపు లేని పార్టీల అభ్యర్థులకు మాత్రం పది మంది ప్రతిపాదించాలి. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో ఓటు ఉన్నా తమకు నచ్చిన అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయవచ్చు. అభ్యర్థిని ప్రతిపాదించేవారు మాత్రం కచ్చితంగా పోటీ చేస్తున్న నియోజకవర్గానికి చెందినవారే అయి ఉండాలి. అభ్యర్థులు వేరే నియోజకవర్గానికి చెందినవారు అయి ఉండి, ఇంకొక నియోజకవర్గంలో పోటీ చేస్తుంటే కనుక తమ సొంత నియోజకవర్గంలోని రిటర్నింగ్ అధికారి నుంచి సర్టిఫికెట్ తెచ్చుకోవాలి. జనరల్ అభ్యర్థులు నామినేషన్‌తో పాటు రూ.10వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5వేలు చెల్లిస్తే సరిపోతుంది. అయితే, వారు తమ కుల ధ్రువీకరణ పత్రాన్ని సమర్పిస్తేనే ఈ సౌకర్యం లభిస్తుంది.

ఐదుగురినే అనుమతిస్తాం

నామినేషన్ దాఖలు చేయడానికి ఐదుగురు వ్యక్తులను మాత్రమే ఆర్వో కార్యాలయంలోకి అనుమతిస్తాం. అభ్యర్థులకు మద్దతుగా వచ్చిన జనాన్ని ఆర్వో కార్యాలయానికి వందమీటర్ల దూరంలో ఆపేస్తాం. ఒకపక్క వందడుగుల రోడ్డుకు ఆనుకొని ఉన్న హైవేపై, మరోపక్క గాజువాక కోర్టుల సముదాయం వద్ద జనాన్ని ఆపేస్తాం. సాధారణ ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది ఉండదు. అభ్యర్థుల ర్యాలీలను మాత్రమే ఆయా హద్దుల్లో నిలిపివేస్తాం. అక్కడి నుంచి మూడు వాహనాలను లోపలికి అనుమతిస్తాం. అవి కూడా తహసీల్దార్ కార్యాలయం గేటు వద్ద ఆగిపోవాలి. నామినేషన్ల దాఖలు ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు వీడియోగ్రఫీతోపాటు సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేశాం.

83 సమస్యాత్మక కేంద్రాలు

ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సిబ్బందికి ప్రణాళికాబద్ధంగా శిక్షణ కార్యక్రమాలు సాగుతున్నాయి. ఏయూలోని కెమికల్ ఇంజినీరింగ్ బ్లాక్‌లో గాజువాక నియోజకవర్గానికి సంబంధించి స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్లను ఏర్పాటు చేశాం. నియోజకవర్గంలో మొత్తం 302 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. 24 లొకేషన్లలో 83 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, అవసరమైన చర్యలు చేపడుతున్నాం.

3.30 లక్షల మంది ఓటర్లు

నియోజకవర్గంలో ప్రస్తుతం 3,30,870 మంది ఓటర్లు ఉన్నారు. మరో 1500 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. ఎలక్ట్రోరల్ పాపులేషన్ రేషియో 762 మందిగా ఉంది.

29న అభ్యర్థుల తుది జాబితా

నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 25వ తేదీ వరకు కొనసాగనుంది. ఒక వ్యక్తి నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చు. 26వ తేదీన నామినేషన్ల పరిశీలన ప్రక్రియను పూర్తి చేస్తాం. 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు. అదే రోజు సాయంత్రం అభ్యర్థులకు ఎన్నికల గుర్తులను కేటాయించి, కేటగిరీల వారీగా విభజించి అభ్యర్థుల తుది జాబితా రూపొందిస్తాం.

ముగిసిన లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధన పీఠంలో నిర్వహిస్తున్న లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. నవరాత్రి వేడుకల్లో చివరిరోజు లలితాంబిక అమ్మవారు లలితా మహాత్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి సన్నిధిలో విశేష హోమం,లలితా సహస్రనామ హవనము విశేషంగా జరిగాయి. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా శ్రీరామ మూలమంత్ర హవనం నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో అభిషేకానంతరం సహస్ర శ్రీలలితా సహస్ర నామావళి సామూహిక కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో చేశారు. సాయంత్రం నిర్వహించిన అమ్మవారి రథయాత్రలో గురుమాత అన్నపూర్ణతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


లలితా మహాత్రిపుర సుందరిగా లలితాంబిక